
జో చిన్నారావే..!
బాలగేయాలు
డా॥ వాసా ప్రభావతి

## CONTENTS




1. అంకితం 3
2. బాలప్రభ 4
3. జాబిల్లి రావే ! 6
4. చిట్టిపొట్టి పిల్లలం 7
5. అ ఆ లు 10
6. జాబిల్లి రావె 12
7. దీపాలు-దీపాలు 14
8. బంగారు పాప 15
9. గుమ్మాడమ్మా! గుమ్మాడీ! 17
10. జాబిల్లీ - జాబిల్లీ 19
11. మబ్బులు మబ్బులు 21
12. వానలు వచ్చె చెల్లప్పా! 23
13. గడియారం - గడియారం 25
14. చినుకులు... చినుకులు 27
15. చెమ్మచెక్క 29
16. బడికి పోవుదమా!! 31
17. టింగు టింగు గడియారం 32
18. చిట్టి చెల్లెలు 34

19. పిల్లలకే పెత్తనమిస్తే 35
20. చిలకమ్మా! చిలకమ్మా! 36
21. కోకిలమ్మా! ఓ కోకిలమ్మా! 38
22. సిపాయి - సిపాయి 40
23. తెలుగు బాలల్లారా! 42
24. భావిపౌరుల్లారా! 44
25. అమ్మా! అమ్మా! 46
26. నవ్వాలి చిట్టిపాప! ల్లారా!! 48
27. పాపాయి పుట్టింది 50
28. సీతారాములు! 52
29. తప్పక చదవండి! 54



అంకితం



కథానిక, నవల, వ్యాసం, విమర్శ మొదలైన రచనలు చేసి ప్రముఖ రచయిత్రిగా పేరు గడించి, బాలసాహితీమూర్తిగా- యువరాజు, స్నేహం, అందాల చిలక, రైతుబిడ్డ మొదలగు బాలల నవలలు రాసి, యువరాజు నవలకు సాహిత్య అకాడమీ బాలల పురస్కారం అందుకున్న బాల సాహితీవేత్త, అనేక సంవత్సరాలు ఆంధ్ర పత్రికలో ప్రశ్నావళి శీర్షిక ప్రచురించి, ఆ బాలగోపాలాన్ని ప్రోత్సాహపరిచిన సాహితీ చైతన్యమూర్తి

డా|| కె.రామలక్ష్మిగారికి
''జాబిల్లి రావే'' బాలగేయాలను అభిమానంతో అంకితమిస్తున్నాను.

-వాసా ప్రభావతి

'చిన్నప్పుడు బొమ్మలు వేసేవాడిని. చిన్నప్పటిలా ఆ బొమ్మలు ఇప్పుడు వేద్దామన్నా రావడం లేదు' అన్నాడట ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు 'పికాసో'. బాల్యాన్ని వయోధికంలోనూ నిలుపుకోవడం, ఆ బాలానంద భావవైచిత్రిని నిలుపుకోవడం మాటలు కాదు. చిట్టిపొట్టి పిల్లలకు నచ్చే బాలసాహిత్యం సృష్టించడం నిజంగా ఒక ప్రజ్ఞ!

అమ్మమ్మగానో, నాన్నమ్మగానో అయ్యాక మనుమలకు, మనుమరాండ్రకూ చేరికకాగల గేయసాహిత్య సృజన చేయడం, నిజంగా ఒక తరం భవితవ్యానికి బాటలు వేయడమే! కవయిత్రిగా, రచయిత్రిగా, సాహితీవేత్తగా డాక్టర్ వాసా ప్రభావతిగారు కడు ప్రసిద్ధులు. 'లేఖిని' సంస్థ అధ్యక్షులుగా స్త్రీలలో సృజనాత్మక వికాసానికి అవిరళకృషి చేస్తున్న వారిది నిరంతర 'లేఖిని' యే!

సరికొత్తగా 'జాబిల్లిరావే' అంటూ సంతరించిన ఈ బాల గేయ సంపుటిలో పాతిక రచనలున్నాయి. సరళసుందరమైన శైలిలో ఈ గేయాలను అల్లారు ఆవిడ. అందునా ఆడపిల్లల మీద, పాపల అందాల ప్రాముఖ్యం తెలిసేలా, ప్రభావతిగారు రాసిన-బంగారుపాప, గుమ్మాడమ్మా గుమ్మాడి, చిట్టిచెల్లెలు, నవ్వాలి చిట్టిపాపల్లారా, పాపాయి పుట్టింది వంటి గేయాలు ఆడశిశువును అక్కునచేర్చుకుని మక్కువ పెంచే ప్రయోజనం సాధించగల స్ఫూర్తినిచ్చేవిగా ఉన్నాయి.

ఈ తరం పిల్లలకు ప్రకృతితో మమేకమై ఆడిపాడే అవకాశాలూ తగ్గిపోతున్నాయి. వాసా ప్రభావతిగారు అందుకే పిల్లలకు తాము మబ్బులు, చినుకులు, వానలతోనూ; చిలకమ్మ కోకిలమ్మవంటి పక్షులతోనూ పరవశించే పదాలు కూర్చారు. కాలం విలువను చెప్పకనే చెప్పే గడియారం గురించీ, చదువు విలువను చదివిచెప్పే 'బడికిపోవుదమా' వంటి గేయాలు అల్లారు. 'సిపాయి'తో దేశభక్తి గురించీ, 'సీతారాములు'తో దాంపత్య మాధుర్యపు చిరుభక్తి గురించీ చెప్పారు.

మంచిని పెంచే దెందుకు
అందరు హాయిగ బ్రతికేటందుకు

అన్నది లక్ష్యం కనుకనే-ఈ గేయాల ద్వారా బాలబాలికల్లో మంచిని హాయిగా మనసుకు హత్తుకునేలా సందేశాత్మకం చేశారు. 'చిట్టిచెల్లెలు' వంటి గేయాలు అన్నచెల్లెళ్ళ అనుబంధానికి పోదికలిగించేవిగా, మానవీయ విలువల దిశగా మహోదాత్తమైనవని చెప్పాలి. అలాగే భావిపౌరుల్లో



జాతీయతా ప్రచోదనం చేశారు.

దేశభాషలు వేరైనా
తెలుపునలుపు రంగులు వేరైనా
దేశాలు, రాష్ట్రాలు వేరైనా
అందరు భరతమాతకు
పిల్లలమని చాటండి

అంటారు. వృద్ధాప్యం రెండో బాల్యం అన్నారు. ఆ బాల్య మధురిమలు ఆవాసమై ఎదలో వున్నాయికనుకనే, వాసా ప్రభావతిగారు ఈ బాలగేయాలు పసిపిల్లలలాగానే-తన ఊహలరెక్కలతో విహరించి, తోచినరీతిలో తేటమాటలతో తేలతెల్లం చేశారు. తన ఆడపిల్లలనే కాక, పెనిమిటి ఆరుద్ర గారిని కూడా పిల్లల్లాగానే చూసుకున్న సౌజన్యమూర్తి, ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కె.రామలక్ష్మిగారికి ఈ గేయసంపుటిని అంకితం చేయడం బావుంది. ఈ గేయాలకు బొమ్మలు సంతరించి, ఆ నాలుగుమాటలు రాసే సౌగంధిక మైత్రి నెరపిన, డా||వాసా ప్రభావతిగారికి వందన చందనాలు.

శుభాకాంక్షలతో...

హైదరాబాద్ — సదా మీ
'ఫాదర్స్‌డే' 21.6.2015 — సుధామ

# 3. జాబిల్లి రావే !

కథలు, గేయాలు పిల్లలకోసం శాశ్వతరూపంలో, అందంగా అందిస్తున్న డా|| వాసా ప్రభావతిగారి పుస్తకాల్ని చూసి తెలుగు సాహితీలోకం ఎంతగానో ఆనందిస్తుంది. అప్పట్లో తాతయ్యలు, బామ్మలు, అమ్మమ్మలు పిల్లలు ఏడవకుండా అన్నంతినడానికి, మారాం చేయకుండా నిద్రపోవడానికి పాటలు పాడేవారు, కథలు చెప్పేవారు... తర్వాతి రోజుల్లో ఆ లోటు తీరడానికి 'చందమామ' లాంటి పత్రికలొచ్చాయి... ఆ కోవలోనే పిల్లలకోసం వస్తున్న చక్కటి గేయ సంపుటి.

మిత్రుడు సుధామ 'బాలప్రభ'లో గొప్ప వాక్యాన్ని రాసాడు-ఈ తరం పిల్లలకు ప్రకృతిలో మమేకమై ఆడిపాడే అవకాశాలు తగ్గిపోతున్నాయని. ఇది నిజమైన మాట! పిల్లలు ప్రకృతిలో ఆడిపాడే గొప్ప చిన్నారు పాటల్ని రాయడంతోబాటు వాటిని తెలుగువాళ్ళ ఆరాధ్య రచయిత్రి డా|| కె.రామలక్ష్మిగారికి అంకితమివ్వాలని డా|| ప్రభావతిగారు సంకల్పించడం బాల సాహిత్యంలోనే సుమధుర ఘట్టం.

అట్టమీద బొమ్మని చిత్రకారులు బాలి; లోపలి బొమ్మల్ని- ముందుమాటతో చిత్రకారులు, కవి సుధామ అందించారు. ఇవి ప్రతిభగల డా|| వాసా ప్రభావతిగారి గేయాలకు అందమైన అలంకారాలు.

ఇప్పుడీ గేయాల్ని విని, ఆనందించే పిల్లల్లో రేపు ఎంతమంది గొప్ప కవులు, రచయితలవుతారో కదా! చిన్నతనం నుంచే తెలుగు భాషపట్ల పిల్లలకు మక్కువ కలిగించాలని డా|| వాసా ప్రభావతిగారు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతం కావాలని ఆశిద్దాం.

మీ
-వేదగిరి రాంబాబు



# 4. చిట్టిపొట్టి పిల్లలం




అమ్మకు చిట్టితల్లిని
నాన్నకు పొట్టి తండ్రిని
అమ్మ నాన్నలె మాకు
అనురాగ దైవాలు
ఈ భువిలో అనురాగ దైవాలూ!

అమ్మ ఒడిలో పెరిగాము
నాన్న ఎదలో ఒరిగాము
అమ్మా, నాన్నలె మాకు

©$®

అనురాగ దైవాలూ!!
ఈ భువిలో అనురాగ దైవాలూ!!

అమ్మకు చిట్టితల్లిని
నాన్నకు పొట్టి తండ్రిని
అమ్మ నాన్నలె మాకు
అనురాగ దైవాలు
ఈ భువిలో అనురాగ దైవాలూ!

అమ్మ ఒడిలో పెరిగాము
నాన్న ఎదలో ఒరిగాము
అమ్మా, నాన్నలె మాకు
అనురాగ దైవాలూ!!
ఈ భువిలో అనురాగ దైవాలూ!!

అమ్మమాట వింటామూ
నాన్న మాటే చేస్తామూ
అమ్మా! నాన్నల మాటలె
మాకు ముత్యాల మూటలూ||

అమ్మ వెంటే నడిచామూ||
నాన్న వెంటే తిరిగామూ||



అమ్మా, నాన్నల నడకలె మాకు
రేపటి వెలుగు బాటలు||

అమ్మకంటితో చూస్తామూ
నాన్న చెవితో వింటాము
అమ్మానాన్నల మాటలే మాకు
భవితవ్యానికి బాటలు|

అమ్మ ఇచ్చింది మంచి మనసు
నాన్న ఇచ్చాడు మంచి చేత
అమ్మ, నాన్నల మనసు చేతలు మాకు
శ్రీరామ రక్ష, శ్రీరామరక్ష

©$®




అ ఆ లు చదువుదమా
అందరు కలిసి ఆడుదమా!
ఇ ఈ లు దిద్దుదమా!
ఇంపుగ అందరము పాడుదమా!
ూరంతా మనదే అందామా?
ఎ ఏ ఐ చెప్పుదమా!
ఏదైన పాడుదమా!
ఒ ఓ ఔలు నేర్పుదమా!



పంతులకు మొక్కుదమా!
అం అః లు దిద్దుదమా!
అమ్మ నాన్నలకు దండాలూ!
అందరు కలిసి హాయిగ
చదువుదమా!





చందమామ రావే
తెల్లని వెన్నెల తేవే
పకపక నవ్వులతో
పాలగిన్నెలు తేవే
ఆడుతూ పాడుతూ
పెరుగు ముంతలు తేవే
చుక్కల తేరులపై
పరుగు పరుగున రావే
మబ్బుల తేరులపై
ఊరేగుతు రావే
ఆకాశ వీధులలో



హాయిగా తిరుగుతు
చుట్టి వద్దాం
చందమామ రావే
జాబిల్లి రావే||

©$®




దీపాలూ - దీపాలు
చీకటి చీల్చే దీపాలు
రమ్యమైన దీపాలు
ఇంటికి అందం దీపాలు
కంటికి వెలుగులు దీపాలు
వీధిలో వెలిగే దీపాలు
దారులు చూపే దీపాలు
లోకాలకు వెలుగు దీపాలు
దేవుని గుడిలో దీపాలు
హారతులిచ్చే దీపాలు
పాపాయికి దీవెనలిచ్చె దీపాలు
దీపాలు-దీపాలు






పాపా పాపా
బందు పాపా
పాప చాయ
పసిడి చాయ
పాప నవ్వు
పారిజాత పువ్వు
పాప మోము
పగడాల కెంపు
పాప పలుకు
పంచదార చిలుక
పాప నడక
రాజ హంస సొగసు

©$®

## 8. బంగారు పాప



పాప చూపు
కోటి దీపాల వెలుగు
పాప మనసు
మల్లెపూవు తెలుపు
పాప అంటె
అందుకే అంత ఇష్టం!

## 9. గుమ్మాడమ్మా! గుమ్మాడీ!






గుమ్మాడమ్మా! గుమ్మాడీ!
అమ్మ ఒడిలో గుమ్మాడీ!!
అల్లరి చేసేసే గుమ్మాడీ ||గు||
నాన్న ఒడిలో గుమ్మాడీ
అందాల పాప గుమ్మాడీ
మామ్మ ఒడిలో గుమ్మాడీ
మాటలు నేర్చే గుమ్మాడీ
అక్క ఒడిలో గుమ్మాడీ
ఆటలు నేర్చే గుమ్మాడీ
గురువులు చేతిలో గుమ్మాడీ
చదువులు నేర్చే గుమ్మాడీ

చక్కని తెలివి గుమ్మాడీ
చుక్కల తెలుగు గుమ్మాడీ ||గు||





జాబిల్లీ - జాబిల్లీ
చక్కని తెలుగు జాబిల్లీ
తెల్లని మనసు జాబిల్లీ
చల్లని వెన్నెల జాబిల్లీ
తిరిగి తిరిగె జాబిల్లీ
తిరిగి వచ్చె జాబిల్లీ
జాబిల్లీ వెంటే నేనుంటా!
లోకమంతా నే చూస్తా!
చుక్కల చక్కదనం

©$®

## 10. జాబిల్లీ - జాబిల్లీ

మబ్బుల నల్లదనం
సూర్యుని ఎఱ్రదనం
తూర్పుకొండల అందాలు
పడమటి కొండల చందాలు
అన్నిటిని నేచూస్తా
ఎన్నో సంగతులు నేరుస్తా!
అందరిని మించి నేనుంటా ||జా||



## 11. మబ్బులు మబ్బులు




మబ్బులు పట్టేదెందుకు?
వానలు కురిసేటందుకు!
వానలు కురిసే నెందుకు?
పంటలు పండేటందుకు!
పంటలు పండే నెందుకు?
కడుపులు నింపేటందుకు!
కడుపులు నింపేనెందుకు?
అందరు బ్రతికేటందుకు!
అందరు బ్రతికే దెందుకు?

©$®

మంచిని పెంచేటందుకు!
మంచిని పెంచేదెందుకు?
అందరు హాయిగ బ్రతికేటందుకు!



# 12. వానలు వచ్చె చెల్లప్పా!




వానలు వచ్చె చెల్లప్పా!
వరదలు వచ్చె చెల్లప్పా!
చెరువులు నిండె చెల్లప్పా!
కప్పలు బెక బెక చెల్లప్పా!
ఆటలు ఆడె చెల్లప్పా!
పాటలు పాడె చెల్లప్పా!
బడికి డుమ్మా చెల్లప్పా!
అమ్మ తిట్టె చెల్లప్పా!
నాన్న కసిరె చెల్లప్పా!
పంతులు కొట్టె చెల్లప్పా!


©$®

## 12. వానలు వచ్చె చెల్లప్పా!

లెంపలు వేసుకుని చెల్లప్పా!
పలక బలపం పట్టి చెల్లప్పా!
బడికి పోదాం చెల్లప్పా!
బుద్ధిగ చదివె చెల్లప్పా!
పాఠాలు చదువుదాం చెల్లప్పా!
పెద్ద చదువులు చదువుదాం చెల్లప్పా!
గొప్ప ఉద్యోగాలు చేద్దాం చెల్లప్పా!
అందరికి ఆనందం అందిద్దాం చెల్లప్పా!



## 13. గడియారం - గడియారం




గడియారం - గడియారం
గంటలు కొట్టె గడియారం
కాలాన్ని కొలిచే గడియారం
పొద్దుట లేపే గడియారం
బడికి పంపే గడియారం
చదువులు నేర్పే గడియారం
మంచి మార్కులు తెప్పించే గడియారం
అన్నా అక్కకు కావాలి గడియారం
నాకూ కావాలి గడియారం

గణగణ గంటలు కొట్టె గడియారం
నీకూ నాకూ కావాలి గడియారం
గడియారం! గడియారం!
మా మంచి గడియారం!!






చినుకులు చినుకులు
చిటపట చినుకులు
పెద్ద చినుకులు
గిలిగింతలు పెట్టే చినుకులు
వడి వడి చినుకులు
వడగళ్ళ చినుకులు
నోట్లో దిరిగె చినుకులు
చల్లని చినుకులు
హాయిని ఇచ్చే చినుకులు
బట్టలు తడిపె చినుకులు
జల్లు జల్లున చినుకులు
శ్రావణమాసపు చినుకులు

©$®

## 14. చినుకులు... చినుకులు

పసుపు కుంకుమల పేరంటాళ్ళను
పరుగులు పెట్టించే చినుకులు
చెరువులు, గుంతలు నింపె చినుకులు
చేలు, పాదులు పెంచె చినుకులు
రైతులు కాపాడె చినుకులు
చినుకులు - చినుకులు చల్లని చినుకులు



## 15. చెమ్మచెక్క




చెమ్మ చెక్క ఆడుదమా!
చేతులు రెండు కలుపుదమా!
చప్పట్లోయ్ తాళాలోయ్
అంటు పాడుదమా!
దేవునికి దండాలు పెట్టెదమా!
కాళ్ల గజ్జె ఆడుదమా!
కాళ్ళు రెండు చాచుదమా!
ఒప్పుల కుప్ప ఆడుదమా!
ఒయ్యారంగా తిరుగుదమా!
దాగుడుమూతలు ఆడుదమా!
కళ్ళకు గంతలు కట్టుదమా!

©$®

## 15. చెమ్మచెక్క

బొమ్మలపెళ్ళి చేద్దామా!
తూతూ బాకా ఊదుదమా!
పప్పు బెల్లాం కమ్మగ తిందామా!!
చెమ్మ చెక్క ఆడుదమా! చేతులు రెండు కలుపుదమా!!!




## 16. బడికి పోవుదమా!!




బడికి పోవుదమా!
పలక బలపం చేత పట్టి
బడికి పోవుదమా!
గణగణ పాఠాలు చదువుదమా
చకచక పలకపై రాయుదుమా!
పంతులు చెప్పింది శ్రద్ధగ విందామా!
పాఠాలు గణగణ చదువుదమా!
పెద్ద పెద్ద చదువులు చదువుదామా!
పెద్ద పెద్ద ఉద్యోగాలు చేద్దామా!
పెద్దల మన్ననలు పొందుదమా!
దేశానికి అండగ ఉండుదుమా!!

©$®





గోడ గడియారం నేనైతే!
టింగు టింగుమని గంటలు కొడతా!
పాపను నిద్ర లేపేస్తా!
బద్ధకమంతా పోగొడతా!
చురుకుతనం నేర్పేస్తా!
వేళకు బడికి పంపిస్తా!
గంట గంటకు పాఠాలు నేర్పిస్తా
వేళకు తిండి తినిపిస్తా!
గంట కొట్టి ఇంటికి పంపిస్తా
వేళకు నిద్రకు పంపిస్తా
క్రమశిక్షణ అంతా



చక చక నేర్పిస్తా!
బుద్ధిమంతులుగ తీర్చిదిద్దేస్తా!
టింగు టింగు గంటలు కొట్టేస్తా!

©$®

## 18. చిట్టి చెల్లెలు




చిట్టి చెల్లెలా
చిన్ని చెల్లెలా!
బుజ్జి అన్నతో ఆడుకుంటావా!
ముద్దుగ నాతో
సుద్దులు చెబితే
బొమ్మలు ఇస్తా!
గాజులు వేయిస్తా!
ఆకలి వేస్తే గుజ్జు అన్నం పెడతా
దాహం వేస్తే అమృతమే తాగిస్తా
నిద్ర వస్తే నా ఒడిలోనే బజ్జుండ పెడతా
పేచీ పెడితే జోలపాడి జోకొడతా
జోజో పాపా
జోజో చిట్టిపాప




## 19. పిల్లలకే పెత్తనమిస్తే




పిల్లలకే మా పిల్లలకే
పెత్తనమంతా ఇచ్చేస్తే
పిల్లలమంతా పెద్దలమై
దేశాలన్నీ ఏలేస్తాం!
మంత్రులము మేమైతే
మంచి తీర్మానాలన్నీ వెంటనే చేసేస్తాం
లంచాలన్నీ ఎగర గొట్టేస్తాం!
అన్యాయాలన్నీ అరికట్టేస్తాం!!
అధికారులము మేమైతే
నిరుద్యోగ సమస్యను తరిమేస్తాం!
ధరలను అదుపున పెట్టేస్తాం!!
అన్యాయాలను అరికడతాం!
దేశం సుభిక్షం చేసేస్తాం!

©$®



చిలకమ్మా! ఓ చిన్ని చిలకమ్మా!
ఆకురంగు చిలకమ్మా!
అందాలరాశి చిలకమ్మా!
ఎర్రని ముక్కు చిలకమ్మా!
ఆకాశంలో ఎగిరే చిలకమ్మా!
గూళ్ళు కట్టే చిలకమ్మా!
గుడ్లు పెట్టే చిలకమ్మా!
పిల్లల్ని పెంచే చిలకమ్మా
కమ్మని పలుకులు పలికే చిలకమ్మా
నిన్ను పంజరంలో పెట్టేదెవరో!



పంజరం తలుపు తెరిచేస్తా!
హాయిగ ఆకాశంలో వదిలేస్తా!
స్వేచ్ఛగ ఎగిరిపో
చిలకమ్మా! చిలకమ్మా!

©$®




కోకిలమ్మా! ఓ కోకిలమ్మా
గున్నమామిడి కొమ్మపై
ఒయ్యారంగా కూర్చుని
కోటిరాగాలతో పాడుతావు
నీ పాట మాకు నేర్పుతావా?
నీవు పాడినంత తీయగా
మేము పాడలేమనా?
నీ పాటను మేము అనుకరిస్తే
గొంతు చించుకు పాడుతావు?
మామీద కోపమేలా?

©$®



నీలా మామిడిచిగురులు
తిందామనుకుంటే
చిగురులన్నీ చిటారుకొమ్మకున్నాయి
కొమ్మను అందుకుందామంటే
ఆకాశం ఎత్తున ఎదిగిపోయింది
చిన్న పిల్లలమని
చిన్నచూపు చూడక
చిగురులు కోసి
మాకిచ్చావంటే
నీతో సమానంగా పాడేస్తాం!
సంవత్సరానికి ఒకసారి వస్తావూ?
వసంతుని వెంట వెడలి పోతావు?
పెద్దవాళ్ళము మేమైతే
గున్నమామిడి ఎక్కేస్తాము
గుప్పిట్లో నిన్ను పట్టేస్తాము
మాయింట్లో నిన్ను దాచేస్తాము




సిపాయిని నేనైతే
తుపాకిని నే చేతపడతా
దేశరక్షణకై
ప్రాణాలకు తెగించి
నే పోరాడుతా!
సరిహద్దులు దాటి
చొచ్చుకు వచ్చే శత్రు మూకలపై
తుపాకిని నే గురిపెడతా!
శత్రుమూకలను
తరిమి తరిమి కొడతా!
భారతదేశం నాదేశమని

©$®



చాటి చెబుతా
త్రివర్ణ పతాకం
ఆకాశ వీధులలో
విజయపతాకమే ఎగురవేస్తా!





తెలుగు బాలల్లారా!
రేపటి తెలుగు పౌరుల్లారా!
తెలుగు దేశానికి
వెలుగులు మీరే!
తెలుగు దేశాన్ని ఏలేది మీరే!
గోదావరి, కృష్ణా, తుంగభద్రా, పెన్నా
జీవనదులు పారేదేశం!
వరదలు కరువులు
లేకుండా కాపాడాలి!
రాజరాజ నరేంద్రుడు
శ్రీకృష్ణదేవరాయలు వంటి
మహరాజులు పాలించిన దేశం
మహామంత్రులై మీరు



తెలుగుమాత పేరు నిలబెట్టండి
నన్నయ, తిక్కన, పెద్దన,తిమ్మన
మహాకవులతో ఉప్పొంగిన దేశం
కందుకూరి, గురజాడ, రాయప్రోలు
శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, ఆరుద్ర
మహానుభావులతో ఉప్పొంగిన దేశం
మీరు మహా కవులై వెలగాలి
మీ కవితలె పువ్వులై వికసించాలి
తెలుగు తల్లికి
మంగళగీతాలై మ్రోగాలి!

©$®



బాలల్లారా!
భావి పౌరుల్లారా!
చేయి చేయి కలిపె
పిల్లల్లారా!
మీ ఆటల్లో దాగుంది
కొండంత ఆరోగ్యం!
మీ పాటల్లో వెలుగుతుంది
ఆకాశమంత ఆనందం!
పకపక నవ్వే పాపల్లారా
మీ నవ్వుల్లో కోటి వెలుగులున్నాయి
మీ నడకల్లో ఉన్నాయి కొత్త బాటలు!
మల్లెపువ్వు వంటి మనసుల్లా
మాయామర్మం ఇక లేదని చాటండి.
పున్నమి చంద్రుని మోముల్లారా!



తెల్లని వెన్నెల కురిపించండి!
దేశ భాషలు వేరైన
తెలుపు నలుపు రంగులు వేరైనా
దేశాలు, రాష్ట్రాలు వేరైనా
అందరూ భరతమాతకు
పిల్లలమని చాటండి!!

©$®




అమ్మా! అమ్మా!
తెల్లని వెన్నెలలో
చల్లని ఆరుబయట
నీ ఒడిలో నేకూర్చుంటా!
నల్లని మబ్బుల్లో
దోబూచులాడుతూ
నీలి ఆకాశంలో
మెల్లగ తిరిగి
చందమామను
నాకు చూపిస్తూ
అందాల చందమామను



మెలమెల్లగ పిలుస్తూ
తీయగ పాటలు పాడుతూ
గుజ్జనం కలిపి
గోరుముద్దలు
తినిపించవా?
నా పంచి పాత్ర బబ్బులో
అందమైన చందమామను
నాకు చూపించవా?
ఆనందం నాకు పంచవా?
మరి ఆకాశంలోకి చందమామ
పారిపోకుండా పట్టేసుకుంటా
నా ఉయ్యాల తొట్టెకి
పాలవెల్లిలా కట్టేసుకుంటా!

©$®




నవ్వాలి చిట్టిపాపల్లారా!
నవ్వాలి ముద్దుగుమ్మల్లారా!
మీ నవ్వుల జల్లులలో
ముంగిళ్ళు గుమగుమలాడాలి
మీ నవ్వుల వెన్నెలలో
చంద్రుండు దోబూచులాడాలి!
మీ నవ్వుల దివ్వెలలో



చుక్కలు మిలమిల మెరవాలి!
మీ నవ్వుల పొంగుల్లో
సంద్రాలె పన్నీటి స్నానాలు చెయ్యాలి!
మీ నవ్వుల పువ్వులె
మాలలుగా గుచ్చి
గాంధి తాత మెడలో వేయండి!
పొందండి కోటిదీవెనలు

©$®




పాపాయి పుట్టింది!
పదే పదే ఏడ్చింది!
అమ్మఒడిలో వెచ్చగ చేరింది
అందరి ప్రేమను పొందింది ||పా||
అమ్మ తొట్టిలో పెట్టింది
అందాల చిరునవ్వు నవ్వింది!
బామ్మ పక్కన చేరింది
బంగారు కబుర్లు చెప్పింది ||పా||



తాత భుజాన కెక్కింది
దోబూచులాడింది
నాన్న వేలుపట్టింది!
చకచక నడిచింది! ||పా||
అన్న వెంట వెళ్ళింది
ఆటలెన్నో నేర్చింది!
అక్క వెంట వెళ్ళింది
పాటలెన్నో పాడింది ||పా||
పలక చేత పట్టింది
పంతులు చెప్పింది రాసింది
పాఠాలెన్నో చదివింది!
మంచి మార్కులు తెచ్చింది ||పా||
సుద్దులు బుద్ధులు నేర్చింది
సుగుణాల సుందరి వెలిగింది
అందరి మనసులు దోచింది
ఆనందంతో హాయిగ కులికింది

©$®




సీతమ్మ పెళ్ళి కూతురాయె!
రామన్న పెళ్ళికొడుకాయె!
జగమంత కల్యాణమాయె!
లోకమంతా పండగాయె! ||సీ||
ఆకాశమంతా పందిరాయె
భూదేవి అంతా అరుగాయె
దేవతలంతా పెద్దలాయె
ఆనందమంతా వెల్లువాయె|| ||సీ||
కిన్నెరలు వీణలు వాయించె
గంధర్వులు గానాలు చేసె

©$®



సప్త ఋషులు మంత్రాలు చదివె
పెద్దలంతా ఆశీర్వదించె
జనులందరికి కన్నుల పండువాయె ||సీ||

పిల్లలూ! మీరు ఈ పుస్తకాలు చదివారా? తప్పక చదవండి!

ప్రముఖ రచయిత్రి డా|| వాసా ప్రభావతిగారి కలం నుంచి

వెలువడిన బాలసాహిత్యం



పిల్లలు నీతి, నిజాయితీలతోబాటు ధైర్యసాహసాల్ని బాల్యం నుంచే పుణికి పుచ్చుకోవాలి! అలాంటి పిడుగుల కథే ఈ నవల!

పిల్లలందరూ తప్పక చదవాల్సిన నవల

వెల : రూ.50/-





అందమైన కథలు...

ఆనందాన్నిచ్చే కథలు...

మంచి వ్యక్తిత్వాన్ని పెంచే కథలు...

బాలలందరూ చదవాల్సిన కథలు...

మంచి భవితవ్యానికి పునాది వేసే కథలు...

తప్పక చదవాల్సిన కథలు

వెల: రూ. 50/-

వాసా ప్రచురణలు

16-10-27/144, మున్సిపల్ కాలని, మలక్‌పేట, హైదరాబాదు-500 036 ఫోన్: 9849178196

